# తా వలచింది రంభ

అప్పటికి గడియారం రాత్రి తొమ్మిది గంటలు మాత్రమే చూపించింది. సతీష్ పుస్తకం తిరగేస్తూ మధ్య మధ్య టి.వీ. వైపు చూస్తున్నాడు.

పొద్దున్న విశాఖపట్నం నుంచి వచ్చిన ఫోన్‌కాల్ విషయం చెప్పాలనుకున్న సుందరి టి.వి. ఆపేసి, భర్త పక్కన కూచుంది.

మీ స్నేహితుడు రామ్మూర్తి అక్క కొడుకు ఇంజనీరుటగా. మా రజనీకి ఆ సంబంధం చూడాలని అమ్మ పొద్దున్న ఫోన్ చేసింది - 'ఏమిటి - మళ్ళా చెప్పు' సతీష్ పుస్తకం మూసేశాడు.

'మీ స్నేహితుడు రామ్మూర్తి వున్నాడు కదా - అతని అక్క కొడుకు ఇక్కడే ఇంజనీరుట

'ఇంజనీరా' 'ఊ.. రెండేళ్ళుగా చేస్తున్నాడట. మా చెల్లెలు రజనికి ఆ సంబంధం చూడమని..!' సుందరి ఇంకా ఏదో చెప్తోంది. సతీష్ వినిపించుకోలేదు.

'ఇంజనీరు - బాగుంది' - మనసులో ఏదో మెరుపు మెరిసింది.

'ఏమిటీ - బాగుండటమేమిటి' - సుందరి విసుగ్గా అంది. 'అదే - ఆ సంబంధం మీ చెల్లెలు రజనికి బాగుంటుంది - సరేనా'

'మీకు రామ్మూర్తి మంచి ఫ్రెండుకదా' -

'రామ్మూర్తి నాకు ఫ్రెండు. వాళ్ల అక్కగారు నాకు బాగా తెలుసు-ఊ, ఆ అబ్బాయి - అదే, రామ్మూర్తి అక్క కొడుకు కూడా తెలుసు-ఇంకేమిటి'-

'అదేమరి - మీరు గట్టిగా తల్చుకుంటే మా రజని పెళ్ళి ఈ శ్రావణమాసంలో చేసేయ్యచ్చండీ - మా వాళ్ళు ఎంత కట్నమయినా యిస్తారు - అయినా వాళ్ళకున్నదంతా నాకు, దానికేగా..'

"ఊ" 'ఊ ఏమిటి - రేపే రామ్మూర్తితో మాట్లాడండి - మా చెల్లెల్ని పిలిపిస్తాను.. పాపం అమ్మ నాన్న దాని పెళ్లికోసం ఎంతో బెంగపడిపోతున్నారు.' అంది సుందరి సతీస్ ముఖంలోకి చూస్తూ.

'ఇంజనీరా'

'అబ్బ ఎన్నిసార్లు చెప్పాలీ'

'ఏవరన్నావు'

'రామ్మూర్తి అక్క కొడుకు'

రామ్మూర్తి అక్క కొడుకు - సతీష్ ' మళ్ళా ఆ మాట అంటూ గిరగిరా తిరిగే ఫాన్ వంక చూస్తూ పడుకున్నాడు.

'మరిచిపోకండి నే చెప్పింది - మీ రామ్మూర్తి' సుందరి భర్తతో పొద్దున్న మళ్ళీ చెప్పింది.

'మా వాళ్ళు ఎంత కట్నమయినా ఇస్తారు'

'అవునా'

'అవును'

'మరి ఈ సంబంధమే ఎందుకూ-'

'అంటే'

అదే ఇంకోటి చూడచ్చుగా 'సతీస్' ఏదో ఆలోచిస్తున్నాడు.

'అంటే మీ ఉద్దేశమేమిటి'?

'పెళ్లి సంబంధాల విషయంలో మనకెందుకీ గొడవలనీ' నసిగాడు సతీష్ - అందులో స్నేహితుడి అక్క కొడుకు'.

'అంటే మీరు చూడరా' కోపంగా అంది సుందరి.

'తమాషాగా అన్నాను.. ఎందుకు చూడనూ - ఇవాళే రామ్మూర్తితో మాట్లాడుతా. పైగా రజని మంచిపిల్ల.. సతీష్ గబగబా ఆఫీసుకి బయలుదేరాడు.

సతీష్ ఆఫీసుకి వెళ్ళగానే సుందరి విశాఖపట్నం తల్లికి ఫోన్ చేసింది... రజనీని మీరెవరైనా తీసుకురండి... 'రెండు మూడు రోజుల్లో పెళ్ళి చూపులు ఏర్పాటుచేద్దాం. మీ అల్లుడుగారు ఈ సంబంధం రజనీకి ఎలాగైనా ఖాయం చేసేద్దామనుకుంటున్నారు' అంది చాలా సంతోషంగా సుందరి.

ఆఫీసు నుంచి ఇంట్లో సతీష్ అడుగుపెట్టడం ఆలస్యం. 'అడిగారా' అంది సుందరి. 'ఆ' - బూట్లు విప్పుతూ అన్నాడు సతీష్.

'ఏమంటారూ'

'ఏమీ అనరు'

'అంటే'

'అదే'

'అదంటే - పిల్లని చూస్తానన్నారా' సుందరి సతీష్ ముఖంలోకే చూస్తోంది.

'మంచిబుద్ధిమంతురాలని, పనిమంతురాలనీ, బాగా కట్నం ఇస్తారనీ, మర్యాదస్తులనీ - చెప్పారా - లేదా'

'ఏమిటి గొడవ - మీ ఆస్తితో వాళ్ళకీ పనిలేదుట -' మంచి నీళ్ళు తాగుతూ

అన్నాడు.

'ఆలోచిస్తారట'

'మన రజని తెలుపు కదా – అడిగినంత కట్నం'

'అంటే'

'అబ్బ, విసిగించకు . . మీ చెల్లెలి పెళ్ళి విషయం అంత ఖంగారేమిటీ – రజనీని ఎవడైనా చేసుకుంటాడు – బంగారు బాతు' సతీష్ లోపలకెళ్ళి లుంగీ కట్టుకొచ్చాడు.

సుందరికి ఒళ్ళు మండిపోయిది.

'అంటే ఈ సంబంధం మీరు పట్టించుకోరు అంతేనా – సరే, నేనే రామ్మూర్తిగారి అక్కను కలసి మాట్లాడుతాను. ఏదో ఇంటి అల్లుడని మా నాన్నవాళ్ళ గొడవ కానీ, నేను వెళ్ళి ఈ సంబంధం కుదుర్చుకు రాలేనా. . . మా చెల్లెల్ని రమ్మని ఫోను చేస్తాను – వాళ్ళని పెళ్ళిచూపులకి రమ్మంటాను – అది తెలుపు కాదా – ఏమన్నా అర్థముందా మీ మాటల్లో – అయినా, మావాళ్ళ విషయాలు మీరు పట్టించుకోరులెండి, నాకు తెలియదా, కోపంతో సుందరి బుగ్గలు ఎరుపెక్కాయి.

'ఆ రామ్మూర్తి ఆఫీసుకి నేనే వెడతాను – ఏం తప్పా' అంది సుందరి.

'చాలా తప్పు – నువ్వు పెళ్ళి సంబంధం విషయంగా ఆఫీసుకి వచ్చి రామ్మూర్తితో మాట్లాడావు అంటేనే వాళ్ళకి నీ మీద కోపం వస్తుంది. ఆ తర్వాత మీ చెల్లెలిని చూడ్డానికి రావాలంటే ...'సతీష్ ఏదో అనబోయాడు...సుందరి కోపం కట్టలు తెంచుకుంది. "తెల్లపిల్ల కావాలట అన్నారు – సరే, 'పిల్లని చూసాక తెలుపుకాదని వాళ్ళు సంబంధం మానేస్తే – చెప్తా, అయినా మా నాన్నని అనాలి. తిన్నగా ఆ రామ్మూర్తి అక్కగారికి ఉత్తరం రాయక మధ్యలో మీరేమిటి? –వాడెవడో ఎలా చెప్పాడో– ఆలివంక వారు ఆత్మబంధువులట" మీకు ఆలివంక వారు శత్రువులు – ఇదే కనక మీ బాబాయి పిల్లలో, మీ అన్నయ్య పిల్లలో అయితే పరిగెత్తే వారు కదూ'

సతీష్ ఫక్కున నవ్వాడు.. ఆ నవ్వు చూస్తుంటే సుందరికి ఉడుకుమోత్తనం మరీ ఎక్కువైంది.

'నాన్నకి ఫోన్ చేస్తాను చెల్లెల్ని తీసుకురమ్మని – ఆయనే మాట్లాడుకుంటారు' అంది సుందరి.

'ఇటు విను, నిన్ను ఏడిపిద్దామని సరదాగా అన్నాను. రామ్మూర్తితో మాట్లాడాను .. వాళ్ళ అక్కగారు ఊరెళ్ళిందట. రెండు రోజుల్లో వచ్చాక మాట్లాడుకుందామన్నాడు" – సతీష్ మాటలకి సుందరి ముఖం విప్పారింది.

సతీష్ ఆ రాత్రి అంతా నిద్రపోలేదు.. రకరకాల ఆలోచనలు - తెల్లగా అందంగా ఉండి, బోల్డు డబ్బుండి, ఇంకా ఇలాటివెన్నో వున్న ఆడపిల్లకి పెళ్ళి చేయడానికి ఇంత తాపత్రయం పడుతుంటే, పాపం, బాబాయి - అమ్మో! ముగ్గురమ్మాయిలకి ఎలా పెళ్ళి చేస్తాడో ఏమో!! - ఏమో!! పైగా బాబాయిలా నల్లని పిల్లలు!! - సతీష్ ఆలోచనలు ఎటో వెళ్ళిపోయాయి.

రెండురోజులయ్యాక, విజయవాడ, విజయవాడ ఆఫీసు పనిమీద వెళ్ళాలని బయలుదేరాడు సతీష్, రామ్మూర్తితో కలిసి.

ఒక్క రోజులో తిరిగి వచ్చిన భర్తను చూసి 'అప్పుడే వచ్చేసారేమిటీ. వారం రోజులన్నారు' అంది సుందరి

'నా పని అయిపోయింది, వచ్చేశాను'

సతీష్ చాలా సంతోషంగా ఉన్నాడు. ఈలపాట పాడుతూ గదిలో పచార్లు చేశాడు. గబగబా ఎన్నో ఫోన్లు చేశాడు.

'ఏమిటా హడావిడి' అంది సుందరి.

'అదే మా బాబాయి కూతురు..'

'ఏమిటీ - మీ బాబాయి కూతురేమిటీ' అంది ఆశ్చర్యంగా సుందరి.

'అబ్బ కొంచెం సేపు విసిగించకు .. మా బాబాయి కూతురు పనిచేసే స్కూలు దగ్గర మా ఆఫీసు - మళ్ళీ ఎల్లుడి వెళ్ళాలి"

'ఈ మాటు నేనూ వస్తా' అంది సుందరి.

'పిల్లాడితో బస్సు ప్రయాణం ఏం సుఖం - బాబాయి మళ్ళీ ఇక్కడికి వస్తారుగా శ్రావణమాసం రాగానే' అన్నాడు సతీష్.

"నాకేమీ అర్థం కావటంలా... శ్రావణమాసమేమిటీ" అంది సుందరి.

"నాకే అర్థం కావటంలేదు నేనేమి మాట్లాడుతున్నానో... ఒక్క రెండు రోజులు నన్ను విసిగించవద్దు. రెండు రోజుల్లో ఖాయం చేసుకుంటే"- సతీష్‌కి వెంటనే అర్థమయింది ఏది మాట్లాడకూడదో అదే మాట్లాడుతున్నట్లు తను.

సుందరి సతీష్‌తో మాట్లాడకుండా ముందుగదిలో వెళ్ళి కూచుంది.

మరో రెండువారాలు గడిచాయి.

హడావిడిగా సతీష్ ఆఫీసునుంచి వచ్చి, "అయ్యో, అక్కడే మర్చిపోయాను" అన్నాడు.

'ఏమిటిదీ' అంది సుందరి కాఫీ కప్పు అందిస్తూ.

'శుభలేఖ-బాబాయి కూతురు పెద్దది లేదూ, అదే లలిత. దాని పెళ్ళి-'

'ఎవరూ, ఆ నల్లమొద్దేనా'

'నలుపంటే - అదే మంచి కళ కల ముఖం - పైగా ఏదో మంచి సంబంధమని మా బాబాయి అన్నాడు. అప్పుడు విజయవాడ వెళ్ళినప్పుడు- అన్నాడు నెమ్మదిగా సతీష్. 'ఏదో గంతకి తగ్గ బొంతనీ - ఆమెకి పెళ్ళి అవడమే గొప్ప' - అంది సుందరి.

'మరే, పాపం, మా బాబాయి ఒద్దునపడ్డాడు. ఇక్కడే చెయ్యమన్నారట-'

'ఇంతకీ ఎప్పుడూ'- అది సుందరి

నువ్వేమి వస్తావులే - తెల్లవారుఝామున పెళ్ళి - ఎటో చూస్తూ అన్నాడు సతీష్.

ఖచ్చితంగా వస్తాను .. ముందు డిన్నరుందిగా - పైగా పిన్నిగారికి నేనంటే చాలా యిష్టం అంది సుందరి.

'నీ యిష్టం' అన్నాడు సతీష్ నవ్వుతూ.

పెళ్ళింట్లోకి వెళ్ళగానే 'నువ్వెళ్లు లోపలికి నేను సిగరెట్టు కాల్చుకు వస్తా' అన్నాడు సతీష్',

రామ్మూర్తి సుందరిని ఆహ్వానించాడు. రామ్మూర్తి అక్కకి పరిచయం చేసాడు. సుందరికి అర్థం కావటంలేదు.

'సతీష్ భార్య' అన్నాడు రామ్మూర్తి.

'అమ్మాయీ! మీ ఆయన మా వాడి పెళ్ళి వారంరోజుల్లో కుదిర్చేసాడనుకో. మాకు కట్నకానుకలు ఏమీ అక్కర్లేదు. పిల్ల బుద్ధిమంతురాలై, ఇల్లు దిద్దుకుంటే చాలనుకున్నాం...తెలుపు, నలుపు, రంగు, గొడవ కూడ పెట్టుకోదల్చుకోలేదు - పైగా మా తమ్ముడు ముందరే చెప్పాడు. సతీష్ బాబాయికూతురు చాలా మంచిపిల్ల అనీ,.. అంతే క్షణాల్లో కుదిరిపోయిందనుకో.. ఇంతకీ మీ ఆయనే ఈ పెళ్ళి జరిపించాడు. పెళ్ళి పెద్ద రామ్మూర్తి, అక్క ఇంకా ఏదో చెప్తూనే ఉంది. సుందరి కళ్ళు, బుగ్గలు కోపంతో ఎరుపెక్కిపోయాయి.

ఇప్పుదర్థమయింది. వారంలో రెండుసార్లు విజయవాడ వెళ్ళిన ఆఫీసుపనేమిటో!! ఇంత మంచి సంబంధం తన బాబాయి కూతురికి కుదిర్చేసుకుని -ఛీ ఎంత మోసం!!

సుందరి పీటలమీదున్న పెళ్ళి కూతురి వంక మరోసారి చూసింది - - అబ్బ, ఎంత నలుపో!! "చెప్పండి, ఆ పిల్ల నలుపు కాదా" నిద్ర నటిస్తున్న భర్తని కుదిపింది కోపంగా సుందరి.

'కాదే తెలుపే'

'ఏమిటీ'

'అవును - తా వలచింది రంభ - అంతే'

చూడు, మా వాళ్ళంతా నీకు పళ్ళెత్తన్నారు - ఆనాటికీ ఈనాటికీ నీ పళ్ళు ఎత్తు కాదనే అంటాను - అంతే, తా వలచింది రంభ' - సతీష్ అటు ఒత్తిగిల్లి, వచ్చే నవ్వుని బలవంతంగా ఆపుకోలేక పక పకా నవ్వేసాడు

సుందరి బుసలు కొడుతూ ముందు గదిలోకెళ్ళి సోఫాలో పడుకుంది.

రామ్మూర్తితో సుందరి చెల్లెలు రజని పెళ్ళి విషయమే మాట్లాడలేదని, తెలియని సుందరి ఆ రాత్రి ఆ సోఫాలో ఇబ్బందిగా పడుకుంది!!పాపం!!

పెళ్ళి విషయంలో వందవరకు అబద్ధాలడచ్చున్నారు కానీ తను ఆడింది ఒక్కటేననీ, బాబాయి కూతురుకు మంచి సంబంధం చేసాననే తృప్తితో హాయిగా మెత్తని పరుపు మీద ఒళ్లు మరచి నిద్ర పోయాడు సతీష్.

ఇంటింటి చిత్రాలు - మూసీ

- సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాసపత్రిక ఫిబ్రవరి 2000